

తిరుమలగిరి మండలం జలాల్‌పురంలో ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీ గొర్రెలతో జీవనోపాధి పొందుతున్న యాదవులు

# మంద మెరిసె.. యలమంద మురిసె

## మంచి ఫలితాలిస్తున్న సబ్సిడీ గొర్రెల పథకం

- జిల్లాలో రెండు విడుతల్లో 18,096 యూనిట్ల గొర్రెలు పంపిణీ
- రూ.230.82 కోట్లు ఖర్చు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ప్రస్తుతం మూడింతలు పెరిగిన గొర్రెల మంద
- ఆర్థిక పురోభివృద్ధి సాధిస్తున్న గొల్లకుర్మలు



నాగారం మండలం వర్ధమానుకోటలో సబ్సిడీ గొర్రెలతో పెంపకందారుడు

తిరుమలగిరి, నవంబర్ 7 : కుల వృత్తుల సంక్షేమానికి కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. గొల్లకురుమలకు సబ్సిడీపై గొర్రెలు పంపిణీ చేస్తున్నది. ఈ పథకం ద్వారా అర్హులందరికీ 21 జీవాలు అందించడంతో వాటిని పోషించుకొని గొర్రెల పెంపకందారులు జీవనోపాధి పొందుతూ ఆర్థికంగా బలోపేతమవుతున్నారు. గొర్రెల సంపద, మాంసం ఉత్పత్తి పెంచేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ 2017లో గొర్రెల పంపిణీ పథకం ప్రవేశపెట్టారు. ఈ పథకం ద్వారా 75శాతం సబ్సిడీతో ఒక్కో కుటుంబానికి 20 గొర్రెలు, ఒక పొట్టేలు అందజేశారు. జీవాలకు ఉచిత బీమా సౌకర్యం, ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చేందుకు రవాణా ఖర్చులు ఇవ్వడంతోపాటు పశుగ్రాసం విత్తనాలు సైతం అందజేశారు. సూర్యాపేట జిల్లాలో 280 గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల్లోని 44,943 మంది సభ్యులను గ్రామ సభల ద్వారా ఎంపిక చేశారు. మొదటి, రెండో విడుతల్లో రూ.230.82 కోట్లు ఖర్చు చేసి 18,096 మంది లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లు పంపిణీ చేశారు. అవి ఇప్పుడు మూడింతలయ్యాయి. ఈ పథకంతో గొర్రెల కాపరులు జీవనోపాధి పొందడంతోపాటు ఆర్థికంగా బలోపేతం అవుతున్నారు. గతంలో తమను ఏ ప్రభుత్వాలూ పట్టించుకోలేదని, స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ సబ్సిడీపై గొర్రెలు అందజేసి ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నారని గొల్లకురుమలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### సూర్యాపేట జిల్లాలో ప్రభుత్వం పంపిణీ చేసిన గొర్రెల యూనిట్లు

| నియోజకవర్గం | యూనిట్లు | ప్రభుత్వం భరించిన సబ్సిడీ మొత్తం |
|---|---|---|
| సూర్యాపేట | 3,626 | రూ.46.41 కోట్లు |
| తుంగతుర్తి | 5,940 | రూ.76.62 కోట్లు |
| కోదాడ | 4,176 | రూ.54.12 కోట్లు |
| హుజూర్‌నగర్ | 4,354 | రూ.53.67 కోట్లు |
| మొత్తం | 18,096 | రూ.230.82 కోట్లు |

### ఏడాదికి లక్ష ఆదాయం వస్తుంది

మాకున్న కొద్దిపాటి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. మొదటి విడుతలో నాకు గొర్రెల యూనిట్ వచ్చింది. మంచిగా సాదుకున్నా. ఇప్పుడు 60 గొర్రెల మంద అయ్యింది. వాటి విలువ సుమారు రూ.5లక్షల వరకు ఉంటుంది. పొట్టేళ్లు అమ్మడం ద్వారా ప్రతి సంవత్సరం లక్ష రూపాయల ఆదాయం వస్తున్నది. వాటితో జీవనోపాధి పొందడమే కాకుండా మంచి ఆదాయాన్ని పొందుతున్నా. ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకం ప్రవేశపెట్టిన తర్వాత గ్రామాల్లో చాలా మంది పేద గొల్లకురుమలు జీవనోపాధి పొందుతూ ఆర్థికంగా బలోపేతం అవుతున్నారు. గతంలో ఏ ప్రభుత్వాలూ ఇలాంటి పథకాలు అమలు చేయలేదు. స్వరాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుండడం పట్ల ఆనందంగా ఉన్నది. సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం. మూడోసారి కూడా ఆయనే ముఖ్యమంత్రి కావాలి.

– బోయిని కొమరమల్లు యాదవ్, తిరుమలగిరి

### మంద మూడింతలు అయ్యింది



రాష్ట్ర ప్రభుత్వం గొల్లకురుమలకు సబ్సిడీ గొర్రెలు ఇచ్చి ఆదుకున్నది. వాటిని మంచిగా సాదుకుంటున్నం. ప్రభుత్వం ఇచ్చిన 21 గొర్రెలకు ఇప్పుడు మూడింతలు అయినయ్. ప్రతి సంవత్సరం పొట్టేళ్లను అమ్ముకుంటూ మంచి లాభాలు పొందుతున్నాం. సీఎం కేసీఆర్ పుణ్యమా అని మాకు గొర్రెల మంద అయ్యింది. లేకుంటే ఇబ్బందులు పడేవాళ్లం. తెలంగాణ వచ్చినంకనే అందరి బతుకులు బాగుపడుతున్నయ్.

– గంటా సింహాద్రి యాదవ్, వర్ధమానుకోట, నాగారం మండలం

### సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం



ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకం ద్వారా నాకు 20గొర్రెలు ఇచ్చారు. నేను, నా భార్య కలిసి వాటిని కాసుకుంటున్నాం. ప్రస్తుతం 35 గొర్రెలు అయ్యాయి. చాలా సంతోషంగా ఉన్నది. ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే యాదవుల అభివృద్ధి సాధ్యమైంది. మా కుటుంబంలో ఆరు ఓట్లు ఉన్నాయి. మా ఎమ్మెల్యే గాదరి కిశోర్ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించుకుంటాం.

– మెంతబోయిన బక్కయ్యయాదవ్, తుంగతుర్తి

# అధిక సాంద్రత పద్ధతిని అవలంబించాలి

- కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్



నకిరేకల్ : పాలెంలో అధిక సాంద్రత పత్తి సాగులో క్షేత్ర ప్రదర్శన నిర్వహిస్తున్న కేవీకే శాస్త్రవేత్త చంద్రశేఖర్, ఏఈఓ లింగయ్య

నకిరేకల్, నవంబర్ 7 : చీడపీడల బెడద లేకుండా పత్తిలో అధిక దిగుబడులు సాధించేందుకు అధిక సాంద్రత పద్ధతిని అవలంబించాలని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్ రైతులకు సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ ఆధ్వర్యంలో మండలంలోని పాలెం గ్రామంలో అధిక సాంద్రత పద్ధతిలో రైతులకు పత్తిసాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ అధిక సాంద్రత పత్తి సాగుచేసే రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పెరుగుదల నియంత్రణ, పత్తిలో పోషక యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో రైతు దూదిమెట్ల శ్రీనివాస్ సాగుచేస్తున్న అధికసాంద్రత పత్తిపంటలో క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 150 మంది రైతులు హా జరయ్యారు. కార్యక్రమంలో ఏఈఓ లింగ య్య, సర్పంచ్ కవితా విజయ్ పాల్గొన్నారు.

# గడపగడపకూ సంక్షేమ ఫలాలు

- తుంగతుర్తి బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కిశోర్‌కుమార్
- కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



బీఆర్‌ఎస్‌లో చేరిన నెల్లిబండతండాకు చెందిన కాంగ్రెస్ నాయకులతో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

తిరుమలగిరి, నవంబర్ 7 : పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక పథకాలు ప్రవేశపెట్టారని, ఆ ఫలాలు ప్రతి ఇంటికీ చేరాయని తుంగతుర్తి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని నెల్లిబండతండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు బిచ్చునాయక్, రమేశ్‌నాయక్, భాస్కర్‌నాయక్‌తోపాటు పలువురు మంగళవారం తిరుమలగిరిలోని ఎమ్మెల్యే నివాసంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కిశోర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడూతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ అందాయన్నారు. దాంతో వివిధ పార్టీలు, సంఘాలకు చెందిన నాయకులు, ప్రజలు గులాబీ గూటికి చేరుతున్నారని చెప్పారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆంగోతు హరిచంద్రు పాల్గొన్నారు.